

# ఇదో ఓ కథే!

రావి కొండలరావు

ఓ చేత్తో, చిన్న ట్రంకు పెట్టెనూ, రెండో చేతిలో “జిప్”గల చేతి సంచీ పట్టుకుని, ఆదరాబాదరా స్టేషన్‌లో పడి, టిక్కట్టుకు డబ్బిచ్చి, నోటితో టిక్కట్టు తీసుకుని, చిల్లర అక్కడే మరిచిపోయి, రైలుకూత విని ప్లాటుఫారం మీదకు పరుగెత్తి ఎదురుగ్గా ఏందొరికితే అది ఎక్కేద్దామనే ప్రయత్నంలో కదిలిపోతున్న రైలు బండీలో ప్రాణాలుగ్గబట్టుకుని దూరి— “అమ్మయ్యా” అనుకున్నాడు జగన్మోహనరావు. రైలు చప్పుడులో అతని గుండెలు చేస్తున్న రొద వినిపించలేదు. రన్నింగ్ రేసులో ప్రైజ్ కోసం తంటాలుపడ్డవాడు పడినట్టుగా రొప్పసాగాడు. నెమ్మదిగా పెట్టె కిందపెట్టి, దానిమీద సంచీ పెట్టి చేతులు దులుపుకుని ఇంకాస్త తేలిగ్గా “అమ్మయ్యా” అనుకున్నాడు రెండోసారి.

బండి ప్లాటుఫారం వదిలేస్తున్నది. తలుపు దగ్గరనుంచుని రెండుకడ్డీలూ పట్టుకుని ముందు వెనకల్లో రైలు ఎంత పొడుగుందోనని వంగి చూడటంలో అతని దృష్టి-పెట్టె మీదున్న “రెండు” అంకెమీదా, ఆవెంటనే ‘ఆడబొమ్మ’మీదా పడ్డది.

‘అమ్మయ్యో’ అన్నాడు ఈసారి. జోరు తగ్గించిన అతని హృదయ శకటం మళ్లీస్పీడెక్కింది. వెనక్కు తిరిగి పెట్టెలో చూడటానికి మోహనరావుకు ధైర్యం చాలలేదు. ‘భగవంతుడా, వొచ్చి వొచ్చి ఇందులో పడ్డానా!’ అనుకున్నాడు. ఇది రెండో తరగతి పెట్టె- తను మూడోతరగతి మనిషి. పైగా ఆడవాళ్ళ పెట్టె. తను మగాడు! ఈ అబలలంతా వెనకనే వొచ్చి తనను క్రిందికి తోసెయ్యకూడదా! తనను ఏ దొంగగానో భావించి, గొలుసులాగి బండి ఆపరుగదా! కాకపోయినా గార్డుగాని కొంపదీసి ఇటు పక్క చూసి, ‘ఇదేవిట్రా స్త్రీల పెట్టెలో పురుషుడూ’ అని ఆశ్చర్యపోయి పోలీసులకు వప్పజెప్పడుగదా! బయటకు కనిపించకుండా లోపలకు పోవటానికా ధైర్యం లేదు. ఇక్కడనించుని ఇటే చూస్తూ వుండటానికా అంతకన్నా ధైర్యంలేదు! ‘ఇంత అవస్థపడీ నేను పరుగెత్తుకొచ్చి బండిలో పడ్డానని సంతోషిస్తే వళ్ళి వెళ్ళి పులినోట్లో పడ్డట్టయిందే నా బ్రతుకు! ఇదేం ప్రయాణమోయ్ బ్రహ్మన్నా’ అనుకున్నాడు.

మోహనరావుకు మరో భయంపట్టుకున్నది. ఇంత సేపాయి తను ఈ పెట్టెలో ఎక్కి నించున్నాడుగదా లోపలున్న ఒక్కరూ తనను పట్టించుకోలేదే? కాకపోయినా లోపల మనుషులున్న అలికిడి ఏమాత్రం వినిపించడం లేదేం? ఒకవేళ ఇది ఖాళీపెట్టె కాబోలు-ఐతే

ఇంకే—అంతే తనువెళ్ళి బూర్లగంపలో పడ్డాడన్నమాట. కొంపదీసి, ఈ డిటెక్టివ్ పుస్తకాల్లో చెప్పినట్టు ఏ స్త్రీ శవమున్నా... మోహనరావుకు భయం పట్టుకున్నది. కాస్సేపటికి ఏమయితే కానిమ్మని నెమ్మదిగా తల వెనక్కుతిప్పి పెట్టెలో కలయజూశాడు. కొద్దిదూరంలో ఒకామె చదువుకుంటూ కనిపించింది! ఆమె ఇటుకేసి చూడటంలేదు. తల అటు తిప్పి దీక్షగా పుస్తకం చదువుకుంటున్నది. గాలికి ఎగురుతున్న జుట్టూ, తలనిండా పువ్వులూ మాత్రం వెనకనుంచి కనిపిస్తున్నై. ఆమె మధ్య వయస్కురాలో, యువతో, ఎవతోనని మోహనరావు మథన పడలేదు. తను దిగిపోయినంతవరకూ ఆమె అట్లాగే అటే చూసుకుంటూవుంటే తన కంతే చాలనుకున్నాడు.

మోహనరావు చేతిగడియారం చూసుకున్నాడు. తర్వాత స్టేషను రావటానికి ఎంతలేదన్నా అరగంట పడుతుంది. ఈ అరగంటసేపూ తను నించునే వుండాలన్నమాట! అంతేకాదు—తన వునికి తెలియకుండా నిశ్శబ్దాన్ని కూడా అవలంబించాలి. నిశ్శబ్దంగానే పెట్టెమీద కూచుందామని నెమ్మదిగా పంచీతీసి పక్కనపెట్టి, పెట్టెమీద చతికిల పడబోగా—దిక్కుమాలిన కాలు ముందుకు జారి దభీమని కూలబడ్డాడు. ఇంత రైలు శబ్దంలోనూ ట్రంకుపెట్టె ఢమాల్ మని శబ్దం చేసింది. మోహనరావు తొట్రుపాటుపడి ఛట్టునలేచి నించుని, ఆమెకేసి చూశాడు. ఈ శబ్దానికి నిజంగానే ఆమె ఇటుకేసి తిరిగి చూసింది. మోహనరావు భయపడి వణకసాగాడు. అతన్ని చూసి ఆమె కూడా భయపడి లేచి నించున్నది.

"ఎవరుమీరూ?" అన్నదామె.

"ఈ పెట్టే...ఇదీ..." అన్నాడు మోహనరావు తొందరగా తన పెట్టెను తీసుకుని, 'నువ్వెందుకామెను డిస్టర్బ్ చేశావ్' అన్నట్టు కోపంగా చూస్తూ.

"ఇది ఆడవాళ్ళపెట్టె" అన్నదామె.

'ఆ సంగతి తెలిసిందికాబట్టే ఇంత భయమూనూ' అనుకున్నాడు. అనుకుంటూనే 'ఎక్స్క్యూజ్ మీ' అనీ, 'క్షమించండి' అనీ రెండుభాషల్లోనూ అన్నాడు.

ఆమె మోహనరావును పరీక్షగా చూసింది. పాతికేళ్ళ వయస్సున్న కుర్రాడు. గుండ్రని మొహం, సన్న నిమీసం, వెనక్కుదువ్విన ఉంగరాలజుట్టూ, తెల్లనిబట్టలూ—చదువుకున్న మనిషల్లే కనిపించాడు.

"ఎందుకని ఈ పెట్టెలో ఎక్కారు?" అన్నదామె ఇంగ్లీషులో.

"మీరు నన్ను క్షమిస్తే..." అన్నాడు మోహనరావు బిత్తరగా ఆమెకేసిచూస్తూ.

## [illegible]

ఆమె ఇరవై ఏళ్ళ నవయువతి. శుభ్రమైన చీరకట్టుకున్నది. దంతబొమ్మ నించున్నట్టుంది. మొహం గుండ్రంగా పుష్పంలాగా వున్నది. పెదవులు సహజంగానే ఎర్రగా వున్నై. కళ్ళజోడున్నా లోపలున్న రెండు 'కలువరేకులూ' చక్కగా కనిపిస్తున్నై.

"నేను...ఆదరా భాదరాదరాగా బండెక్కాను. పొరబాటున ఈ పెట్టెలో ఎక్కాను కాని—కావాలనికాదు. మీ కభ్యంతరం లేకపోతే ఇక్కడనించుని బండి ఆగగానే.."

"అభ్యంతరంవుంటే?" అన్నదామె కనుబొమ్మలెత్తి. మోహనరావు దెబ్బతిన్నట్టయి 'ఎహీ హీ హీ' అని నసిగాడు:

"చాలా ఆదరాబాదరాగా బండెక్కానండీ. అర్జెంటుగా ప్రయాణం వొచ్చిపడింది. స్టేషన్‌కు వొచ్చేటప్పటికే..."

ఒకడు ఒక సన్యాసి దర్శించి "స్వామీ కాళ్ళు కదల్చకుండా కాలక్షేపం సంపాదించే మార్గం ఉపదేశించండి" అని ప్రాధేయపడ్డాడు.

సన్యాసి—నీరెండుకాళ్ళూ విరగ్గొట్టుకుని గుడిదగ్గర కూర్చో.

జి. ధనంజయ నాయుడు (తిరుపతి)

"మీరు చెప్పారు" అన్నదామె ఇంగ్లీషులో.

"ఐతే విచారిస్తున్నాను" అన్నాడు మోహనరావూ ఇంగ్లీషులోనే. 'చెబితే ఇంగ్లీషులో విచారించడం ఎందుకూ' అనుకున్నాడు వెంటనే.

"ఏవూరు వెళ్తున్నారు?"

చెప్పాడు.

"ఈ ముందు స్టేషన్లోనే ఎక్కింది?"

అవునన్నాడు.

"సరే అట్లా కూచోండి" అని ఆమె తన సీటులో కూచుని పుస్తకం తీసుకున్నది.

మోహనరావు 'అమ్మయ్య' అనుకుని పెట్టె కిందపెట్టి దానిమీద చతికిల బడ్డాడు.

"బండిలో జనం లేరండీ. పెట్టెమీద కూచుంటారేం పైనకూచోండి" అన్నదామె.

మోహనరావు ఫరవాలేదనుకుని వూరుకున్నాడు.

"ఆడవాళ్ళ సీట్లలో కూచుంటేనామోషీ ఏం లేదు కూచోండి."

మోహనరావు కూచున్నాడు. కూచుని, ఆమెకేసి చూడకుండా కిటికీలోంచిప్రకృతిని చూడసాగాడు అందరూ చూస్తారు కాబట్టి.

"ఏదన్నా పుస్తకం చదువుతారా" అన్నదామె.

ఏదానికీ మోహనరావు 'అబ్బే' అనదలుచుకోలేదు. లేచి, ఆమె దగ్గరగావెళ్ళాడు. ఆమె ఐదారు పత్రికలు తీసి అతని ముందు పడేసింది. అందులో ఒకటి మాత్రమే తెలుగు పత్రిక. మోహనరావు మాతృభాషాభిమానం గలవాడల్లే ఏరి అదే తీసుకున్నాడు.

"కూచోండి" అన్నది ఆమె.

ఆమెకు ఎదురు సీటులోనే తపీమని కూలబడ్డాడు.

"మీ పేరు..."

"జజజగన్మో...ఓఓఓ...హనరావు."

ఈసారి ఆమె 'మల్లెమొగ్గలు' పూయిస్తూ నవ్వింది.

"భయపడకండి. పొరబాటున పెట్టెలో ఎక్కారు. దానికింత భయం ఎందుకూ—స్థిరంగా కూచోండి."

"కాదు.. మీరు... రిపోర్టు.. రైల్వే వాళ్ళు..."

"నే చెబుతా లెండి, ఏదన్నావొస్తే."

'ఐతే ఆమెరిపోర్టు ఇవ్వటానికి కాదన్నమాట తనపేరడిగింది—థాంక్స్' అనుకున్నాడు మోహనరావు—పత్రిక తీసి చూస్తూ. అది అతను సొంతం చదివేసిన పత్రికే. ఐనా ఆమాట అనటం అతనికిష్టం లేదు: ఏనాడూ పత్రిక మొహం ఎరగని వాడిలాగా ఆత్రుతగా చూస్తూ పేజీలు తిప్పసాగాడు.

"చదువుకుంటున్నారా?" అన్నదామె.

మోహనరావు అదోలా ఫీలయ్యాడు ఆ ప్రశ్నకు. తనకంటె వయస్సులో పెద్దవాళ్ళు అడిగినట్టు అడిగింది. ఐతే ఈ రైలుపెట్టెలో ఆమే పాక్కున్న మనిషి. అందుకని, ఆమెకంటె అతను చిన్నవాడి కిందే లెక్క. పెద్దవాళ్ళకు చిన్నవాళ్ళిచ్చే పద్ధతిలోనే—

"లేదండీ, ఉద్యోగం చేస్తున్నాను" అన్నాడు వినయంగా.

"ఆహా" అన్నదామె.

మోహనరావు ఇంక భయపడదలచుకోలేదు. నిజానికి, ముందు తను ఎంతో భయపడ్డాడు. కాని, ఆమె అభయం ఇచ్చింది కాబట్టి ఇహ భయం అనవసరం. తనూ కొన్ని ప్రశ్నలు వెయ్యడానికి వెనుకంజ వెయ్యరాదు.

"మీరూ—" అన్నాడు.

"చదువు పూర్తయి కొత్తగా ఉద్యోగానికి వెళుతున్నాను."

"ఎందులో?"

"ఎడ్యుకేషన్."

"మీ పేరు?"

"ప్రేమలత."

"ఏ ఊరండీ?"

చెప్పింది.

"ఎక్కడ్నుంచి వొస్తున్నారు?"

చెప్పింది.

ఈ ప్రశ్నలు చాలనుకున్నాడు మోహనరావు. ఆమె దీక్షగా చదువుకుంటున్నట్టు కనిపించింది. ఏం చదువుతోందోనని వెనుకగా చూశాడు. ఒకతను, ఒకామెను గాఢంగా కౌగలించుకుని ముద్దుపెట్టుకుంటున్న దృశ్యం బొమ్మ వేసివున్నది. పైన అక్షరాలు చూడగా అదొక 'ప్రేమకథ' అని తెలిసింది. మోహనరావు తెలుగు పత్రిక కింద పడేసి, ఓ ఇంగ్లీషు పత్రిక తీశాడు. పేజీలు తిప్పి, ఒకచోట ఆగి, దీక్షగా చదవసాగాడు. కాస్సేపటికి ఆమె, మోహనరావు కేసి అనుకోకుండా చూసి, అట్లాగే పుస్తకంలోకి చూసింది. ఏదో 'ప్రేమకథ' చదువుతున్నాడు. అతని ఉంగరాల జుట్టు గాలికి తమాషాగా ఒకదానితో ఒకటి సయ్యాటలు సరాగాలూ ఆడుతున్నై. విల్లులవలె పరచుకున్న కనుబొమల కింద నల్లటికళ్ళు రెండూ దీక్షగా పుస్తకంలోకి చూస్తున్నై. ప్రేమలత కిటికీలోంచి బయటకి చూసింది. ఆకాశం మీద మేఘాలు కనిపించాయి.

"వర్షం వస్తుంది కాబోలు" అనుకున్నది గట్టిగానే.

"ఊఁ?" అని మోహనరావు చూసి "రావొచ్చు" అన్నాడు.

ఇద్దరూ కిటికీలోంచి బయటకు చూడసాగారు. టెలిగ్రాఫ్ తీగలమీద రెండు పిట్టలు దగరగా కూచుని కబుర్లు చెప్పుకుంటున్నై.

కాస్సేపటికి మోహనరావు ప్రేమలత కేసి చూశాడు. ఆమె బయటకు చూస్తూ ఏమో ఆలోచిస్తున్నది. మోహనరావు ఇటు తిరిగి పెరుగుతున్న పైరువంక చూస్తూ ఆలోచనలో పడ్డాడు.

ఆకాశం మీద మబ్బుపట్టింది. సాయంత్రమే ఐనా చీకటి ఆవరించబోతున్నట్టుంది. చలిగాలి వీచసాగింది... యిద్దరూ ఏవేవో మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుత చదువుల విషయాలూ, రాజకీయాలూ, వారి వారి కుటుంబాల విషయాలూ మాట్లాడుకోవటంలో వాళ్లిద్దరూ అవివాహితులు అని కూడా తేలింది!

తర్వాత స్టేషను సమీపిస్తున్నది. బండి జోరు తగ్గింది.

"స్టేషను వస్తోంది" అన్నాడు మోహనరావు లేస్తూ పుస్తకం క్రిందపడేసి.

"అవును" అన్నది ప్రేమలత, తను చదువుతున్న పుస్తకాన్ని తీసుకుంటూ.

"చాలా థాంక్స్" అన్నాడు అతను.

"ఆ, ఏముందని?" అన్నది ఆమె.

బండి ఆగింది. మోహనరావు తొందరగా తన పెట్టె, చేతిసంచీ రెండు చేతుల్లోకి తీసుకుని, "వెళ్లివస్తానండీ" అని ఆమెతో చెప్పి ధడాలుమని కిందకు దూకి పరుగు పరుగున వెళ్లి తన మూడోతరగతి మగవాళ్ళపెట్టెలో ఎక్కి కూచుని 'హాక్సు'గల మొహంతో 'అమ్మయ్య' అనుకున్నాడు.

బండి బయలేరింది... ప్రేమలత యథాప్రకారంగా మళ్లీ పుస్తకం చదవటంలో పడిపోయింది......

రెండో తరగతి రైలుపెట్టె మాత్రం ఒకసారి నిర్ఘాంతపోయి, ముక్కుమీద వేలు వేసుకున్నది. ★


